క్లుప్తంగా

తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్రం పూజలు



తిరునక్షత్రం పూజలను నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరి పైనున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్రం పూజలు రెండవరోజు మంగళవారం కొనసాగాయి. ఆలయ ఆస్థాన మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలతో పాటు, తిరుమంగై ఆళ్వార్ ఉత్సవమూర్తిని వేదికపై కొలువుంచారు. దివ్య ప్రబంధ పారాయణం చేశారు. విశేష పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తదితరులు ఆధ్వర్యంలో ఈ నెల 13 వరకు పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

నేడు గీతా జయంతి

సింహాచలం: 98వ వార్డు పరిధి లక్ష్మీనరసింహ నగర్‌లో ఉన్న గోపీ జనవల్లభస్వామి ఆలయంలో బుధవారం గీతా జయంతిని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం 7 నుంచి 7.30 వరకు స్వామికి గోక్షీరాభిషేకం, విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఉదయం 9 నుంచి ఆలయ ప్రాంగణంలో గీతాయజ్ఞం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా గీతాయజ్ఞంలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

రేపటి నుంచి 32 రోజుల శ్రీనృసింహ దీక్ష

సింహాచలం: ఈ నెల 12వ తేదీ(గురువారం) నుంచి 32 రోజుల శ్రీనృసింహ దీక్ష ప్రారంభం కానుంది. సింహగిరిపై ఉదయం 7 గంటల నుంచి దీక్షాధారులకు దేవస్థానం వైదికులు మాలధారణ చేయనున్నారు. ఈ మేరకు దేవస్థానం అధికార, వైదికులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీక్షాధారులకు తులసి మాల, స్వామివారి ప్రతిమని ఉచితంగా దేవస్థానం అందించనుంది. దీక్షా ధారులంతా వచ్చే నెల 12న మాల విసర్జన చేస్తారని దేవస్థానం అధికారులు తెలిపారు.

పంట కోత ప్రయోగాలతో దిగుబడి అంచనా



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న సీపీవో రామారావు, తదితరులు

సబ్బవరం: పంట దిగుబడి లెక్కింపునకు పంట కోత ప్రయోగాలే ఆధారమని అనకాపల్లి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి(సీపీవో) జి.రామారావు తెలిపారు. మండలంలోని మొగలిపురం గ్రామంలో మంగళవారం చేపట్టిన వరి పంట కోత ప్రయోగాలను ఆయన పరిశీలించి, పంట దిగుబడిని లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వరి పంట ప్రయోగాలను జాగ్రత్తగా చేపట్టాలని గ్రామ వ్యవసాయ సహాయకులను సూచించారు. ప్రస్తుతం పరిశీలించిన పంటకోత ప్రయోగం (5/5 మీటర్ల ప్లాట్)లో 11.07 కిలోల దిగుబడి రావడంతో ఎకరాకు 25(75 కిలోల) బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో రాజేశ్వరరావు, ఏఎస్‌వో రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి ధనుర్మాసం సందర్భంగా గోదా రంగనాయకుల కల్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజార్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 13న భోగి పండగ నాడు గోదా రంగనాయకుల కల్యాణోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా జనవరి 1న స్వామివారికి నవనీత సేవ, జనవరి 5న సుదర్శన హోమం, సామూహిక కుంకుమ పూజలు, భారీ అన్నసమారాధన, 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని గిరి ప్రదక్షిణ, ఉత్తర ద్వార దర్శనం ఉంటాయన్నారు. జనవరి 11న కూడారై ఉత్సవం, 12న తిరువీధి ఉత్సవం నిర్వహిస్తామన్నారు.



పందుల స్వైరవిహారం



పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పందుల సంచారం (ఇన్‌సెట్) శారదానగర్‌లో ఇళ్ల మధ్యనే పందులు

- తాండవిస్తున్న అపారిశుధ్యం, అనారోగ్యం
- పందుల నియంత్రణలో జీవీఎంసీ సిబ్బంది నిర్లక్ష్యం
- పెంపకందారులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపడంలో విఫలం

పెందుర్తి: అసలే శీతల కాలం.. దోమలు ఈగలతో రోగాలు విజృంభిస్తున్నాయి. వీటికి తోడు పందుల బెడద. పట్టణ ప్రాంతాల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా జనవాసాల్లో సంచరించి ప్రజల్లో భయాందోళనలు రేపుతున్నాయి. నివాసాల మధ్యలో ఉన్న మురుగును ఆవాసాలుగా చేసుకుని తిష్ట వేస్తున్నాయి. అకస్మాత్తుగా ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి. ఎన్నో స్వల్ప, దీర్ఘకాలిక రోగాలకు కారకాలైన ఈ ఊరపందుల నియంత్రణలో అధికార యంత్రాంగం కనీస చర్యలు కూడా తీసుకోవట్లేదని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. స్వైన్‌ఫ్లూ, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు నియంత్రణలోకి రాని తరుణంలో ఈ పందుల సంచారంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు.

మురుగులో.. మురుగుతో..

పందుల వ్యాప్తికి విలీన ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నిలిచిపోతున్న మురుగు కూడా ఓ ప్రధాన కారణం సాధారణంగా పందులకు మురుగే ప్రధాన ఆవాసం. జీవీఎంసీ జోన్-8 పరిధిలోని పది వార్డుల్లో ఎక్కడ చూసినా అవుట్‌లెట్ సదుపాయం లేక మురుగు ఎక్కడికక్కడే నిల్వ ఉంటోంది. చాలా ప్రాంతాల్లో ఇళ్ల మధ్య మురుగులోనే పందులు తిరుగాడటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గుంపులుగా రోడ్లపై సంచరిస్తున్నాయి. పిల్లలు రోడ్లపైకి రావాలంటేనే భయపడుతున్నారు. పందుల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని చాలాసార్లు చెప్పిన జీవీఎంసీ అధికారుల మాటలు అమలుకు మాత్రం నోచుకోలేదు.

- నిబంధనల మేరకు పట్టణ పరిధిలో పందుల ఫామ్స్ నిర్వహించరాదు. అయినప్పటికీ పెందుర్తి, చినముషిడివాడ ప్రాంతాల్లో ఐదారు అనధికారిక పందుల ఫామ్స్ ఉన్నాయి.
- పెందుర్తి జూనియర్ కళాశాల, దొగ్గవానిపాలెం, చినముషిడివాడ, ఎస్సీ బీసీ కాలనీ, కృష్ణరాయపురం, చీమలాపల్లి, సుజాతనగర్, శారదానగర్, గిరిప్రసాద్‌నగర్, కార్మికనగర్, అంబేడ్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో పందుల బెడద ఎక్కువ.
- పందుల పెంపకందారులకు పందుల వలన కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపడంలో జీవీఎంసీ అధికార యంత్రాంగం కనీస చొరవ కూడా చూపట్లేదన్నది వాస్తవం.

పందులు చాలా రోగాలకు కారకాలు



జనావాసాల్లో పందుల సంచారం ప్రమాదకరం. ప్రజలు పందుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వీటి ద్వారా వచ్చే మెదడువాపు తదితర రోగాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నాం. రోగాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం.

- డాక్టర్ అవంతి, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, పెందుర్తి

నియంత్రణ చర్యలు తీసుకుంటాం



ప్రతివారం పీజీఆర్‌ఎస్‌లో పందుల సంచారంపై ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రత్యేక బృందాల ద్వారా పందుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా పందుల నియంత్రణ చేపడతాం.

- హైమావతి, జోనల్ కమిషనర్, జోన్-8

పైల అప్పలనాయుడు సేవలు చిరస్మరణీయం



పైల కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అమర్‌నాథ్, అదీప్‌రాజ్, తదితరులు



ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పరవాడ: దివంగత మాజీ ఎమ్మెల్యే పైల అప్పలనాయుడు పరవాడ నియోజకవర్గానికి అందించిన సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కొనియాడారు. పరవాడ సంతబయలులో మంగళవారం నిర్వహించిన పైల అప్పలనాయుడు 20వ వర్ధంతి కార్యక్రమంలో అమర్‌నాథ్ పాల్గొని, మాట్లాడారు. పరవాడ ప్రాంతంలో పైల చేసిన అభివృద్ధి కార్యక్రమాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన తనయుడు పైల శ్రీనివాసరావు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీలో కీలకంగా వ్యవహరిస్తూ, పార్టీని ముందుకు నడిపించడంలో తండ్రికి తగ్గ తనయుడిగా ముద్ర వేసుకున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సారథ్యంలో వారు చేస్తున్న కృషిని పార్టీ గుర్తు పెట్టుకుంటుందన్నారు. అంతకుముందు దివంగత పైల కాంస్య విగ్రహానికి అదీప్‌రాజ్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి, అంగన్‌వాడీ కేంద్రాలు, మండల పరిషత్ పాఠశాలలో పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బైలపూడి భగవాన్ జయరాం, మాజీ సర్పంచ్ పైల అప్పారావు, పైల గోపాలకృష్ణ, పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, సబ్బవరం ఎంపీపీ బొకం సూర్యకుమారి, పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి చుక్క రామునాయుడు, మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, నాయకులు నదియా, గొర్లి గోపి, పెదిరెట్టి శేఖర్, బొండా కనకారావు, సీతారామయ్య, బొద్దపు చిన్నారావు, జి.ఎరుకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసపూరిత హామీలపై పోరాటం



96వ వార్డు నాయకులతో మాట్లాడుతున్న అదీప్‌రాజ్

పెందుర్తి: ఎన్నికల సమయంలో ప్రజలకు మోసపూరిత హామీలు గుప్పించి, అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చేలా ప్రజల తరఫున వారిని నిలదీయాలని నాయకులకు పిలుపునిచ్చారు. మంగళవారం రాంపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో జీవీఎంసీ 96వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా వార్డులో కృషి చేయాలని సూచించారు. పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ తరఫున కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వార్డులోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమష్టి బాధ్యతతో సాంఘిక దురాచారాల కట్టడి

- కిశోరి వికాసం కార్యక్రమంపై సిబ్బందికి ఒక రోజు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి

సబ్బవరం: బాల్య వివాహాల వంటి సాంఘిక దురాచారాలను అరికట్టడం మనందరి బాధ్యత కావాలని ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి తెలిపారు. మండలంలోని సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, హైస్కూల్ ఉపాధ్యాయులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్లలోపు వయసున్న ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. వీటి నిర్మూలన పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. బాలలపై జరిగే లైంగిక వేధింపులు, అక్రమ తరలింపు వంటి వాటిపై దృష్టి సారించి నియంత్రించేందుకు ప్రజలంతా సహకారం అందించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఆడపిల్లలు రుతు సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత, తీసుకోవాల్సిన ఆహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం-2012 తదితర చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజ, మండల విద్యాశాఖాధికారి ఎం.కె.రవీంద్రబాబు, సీఐ పిన్నింటి రమణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్వర్ణలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, వెలుగు ఏపీఎం సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

13న సబ్ జూనియర్ ఆర్చరీ ఎంపిక పోటీలు

పరవాడ: పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో ఈ నెల 13న ఏపీ అంతర్ జిల్లాల సబ్ జూనియర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో పాల్గొనేందుకు ఉమ్మడి విశాఖ ఆర్చర్ల ఎంపిక జరగనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆ రోజు ఉదయం 9 గంటలకు పాఠశాలలోని క్రీడా మైదానంలో హాజరుకావాలన్నారు. క్రీడాకారులు పాస్‌పోర్టు సైజు ఫోటో, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాల్సిందిగా సూచించారు.

ఘనంగా అన్నసమారాధన



అన్నసమారాధన ప్రారంభిస్తున్న స్థానిక పెద్దలు

పెందుర్తి: వేపగుంట బీసీ కాలనీలో కొలువైన భూలోకమాంబ మారువారం పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు కుంకుమలు, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు. సుమారు 4 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. పలువురు ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు భూలోకమాంబను దర్శించుకున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు గవరజగ్గయ్యపాలెంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పెందుర్తి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్సర్ ఆలీ(25) స్థానికంగా ఉన్న ఓ సోఫా తయారీ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆలీకి గతంలో పెళ్లై, భార్యతో విడాకులు తీసుకున్నాడు. ఈ క్రమంలో ఇంకో పెళ్లి చేసేందుకు కుటుంబ సభ్యులు సంబంధం చూడగా ఆఖరి నిమిషంలో తప్పిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన ఆలీ.. కుటుంబ సభ్యులకు ఆదివారం రాత్రి వీడియో కాల్ చేసి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం సాయంత్రం ఉత్తరప్రదేశ్ నుంచి పెందుర్తి చేరుకున్న కుటుంబ సభ్యులు జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

సందడిగా ముగిసిన జన్‌జిల్



వివిధ కళాశాలలకు చెందిన విజేతలతో ఆదర్శ్ కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న జన్ జిల్-2024 కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. విద్యార్థులు వివిధ అంశాల్లో పోటీపడ్డారు. కార్యక్రమం ఆసాంతం ఆలోచనాత్మకంగా సాగింది. ఇంటర్మీడియట్/పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థులు చెస్, క్యారమ్స్, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ కాంపిటీషన్స్‌లో చక్కటి ప్రతిభ కనబరిచారు. విజేతలకు కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఫ్లోరా చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఉమా-మహేశ్వరుల కల్యాణోత్సవం



వేదికపై ఉమా మహేశ్వరి, మహేశ్వరుల ఉత్సవమూర్తులు



స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేస్తున్న కాలనీ మహిళలు

సింహాచలం: అడవివరంలోని పాత గోశాల లేఅవుట్‌లో కొలువుదీరిన పాదాలమ్మ, బంగారమ్మ, బాలాత్రిపుర సుందరి ఆలయ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉమా మహేశ్వరి, మహేశ్వరుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను వేదికపై కొలువుంచారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో ఆద్యంతం సందడిగా కల్యాణాన్ని నిర్వహించారు. కాలనీ నివాసితులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కల్యాణం అనంతరం పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు అందించింది.

రెవెన్యూ సదస్సులతో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం



తానాం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు



వంగలి రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

పరవాడ: అపరిష్కృత, దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా రైతులకు మండల ప్రత్యేక అధికారి, జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు సూచించారు. తానాం గ్రామ సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సదస్సులో రైతాంగం వివిధ సమస్యలపై చేసుకున్న అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. గతంలో గ్రామంలో రీసర్వే తప్పులు తడకగా మారిందని మళ్లీ రీ సర్వే నిర్వహించాలని పలువురు రైతులు కోరారు. సదస్సులో రైతుల నుంచి 76 అర్జీలు రాగా ఆర్వోఆర్‌కు 49, రీసర్వేకు 26, ఎఫ్ లైన్‌కు 1 అర్జీ వచ్చింది. సదస్సులో తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, పెందుర్తి జనసేన ఇన్‌చార్జ్ పంచకర్ల ప్రసాద్, పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, కన్నూరు వెంకటరమణ, ఎంపీటీసీ రొంగలి సునీత గోపాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సబ్బవరం: రైతుల భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని వంగలి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగలి రెవెన్యూ పరిధిలోని 309 సర్వే నెంబర్లకుగాను 2,718.14 ఎకరాల భూమి ఉందన్నారు. ఇందులో ప్రభుత్వ భూమి 1,402.63 ఎకరాలు, జిరాయితీ భూమి 1,315.51 ఎకరాలు ఉందన్నారు. రైతుల నుంచి పలు సమస్యలపై 9 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అకుల శ్రీహేమ, ఆర్ఐ వీరయ్యతో పాటు రెవెన్యూ, ఫారెస్టు, ఎండోమెంట్ విభాగాల అధికారులు హాజరయ్యారు.

'పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలి'



మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో మంగళవారం శానిటేషన్ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నెలల నుంచి జీతాల్లేక శానిటేషన్ కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడం, ప్రమాదవశాత్తు మరణిస్తే బీమా సౌకర్యం లేక ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి పారిశుధ్య కార్మికులకు చెల్లించాల్సిన ఆరు నెలల జీతాలను తక్షణమే చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు, యూనిఫాం వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ యూనియన్ మండల అధ్యక్షులు పి.రామలక్ష్మి, కార్యదర్శి ముత్యాలమ్మ, బి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే విద్యార్థులకు ఉన్నత భవిత



విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణను అలవరచుకోవాలని పెందుర్తి సీఐ కె.వి.సతీష్ కుమార్ సూచించారు. పురుషోత్తపురంలోని బాలాజీ హైఫీల్డ్స్ పాఠశాలలో డ్రగ్స్ వాడకం-అనర్థాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేటి కాలంలో విద్యార్థులు, యువత డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలను అలవాటు చేసుకుని జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితిలోనూ చెడు మార్గాల వైపు వెళ్లవద్దని, అలా వెళితే జైలుపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పలు అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. పాఠశాల ప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న డీఎస్‌ఎన్‌ఎల్‌యూ వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య సూర్యప్రకాశరావు మాట్లాడుతూ మన నేపథ్యం, జాతి, మతం, నమ్మకాలతో సంబంధం లేకుండా మానవ హక్కులు అందరికీ సమానమేనన్నారు. ప్రతి వ్యక్తికి సంబంధించిన హక్కులను రక్షించడం ప్రభుత్వాల విధి అన్నారు. దేశంలోని పౌరుల సామాజిక, ఆర్థిక హక్కులకు భారత రాజ్యాంగం పూర్తి రక్షణ కల్పిస్తుందని తెలిపారు. తమ హక్కులను తెలుసుకోవాల్సిన కనీస బాధ్యత పౌరులకు ఉందన్నారు. విశ్వవిద్యాలయ ఆచార్యులు నందిని, డాక్టర్ దయానందమూర్తి, నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మి తదితరులు మానవ హక్కుల ప్రాధాన్యతను తెలిపారు. మానవ హక్కుల సాధన కోసం ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో జరిగిన పోరాటాలు, ఉద్యమాలను ఆసక్తిగా వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.